నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శుక్రవారం 29 డిసెంబర్ 2023 | KAMAREDDY

# పర్యావరణ పరిరక్షణకే.. సైకిల్ యాత్ర



నిజామాబాద్‌కు చేరుకున్న సైకిల్ యాత్రికుడు రాబిన్‌సింగ్

కామారెడ్డి/ ఇందల్వాయి/ నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 28: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సైకిల్ యాత్రికుడు రాబిన్ సింగ్ అన్నారు. ఉమ్మడి జిల్లాలో గురువారం ఆయన సైకిల్ యాత్ర చేపట్టాడు. వేర్వేరు చోట్ల రాబిన్‌సింగ్ మాట్లాడుతూ గ్రీన్ ఇండియా మూవ్‌మెంట్‌లో భాగంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఈటర్ జిల్లా చెక్కరనగర్ తాలూకా నుంచి సైకిల్ యాత్ర చేపట్టానన్నారు. ఇప్పటి వరకు 448 రోజుల్లో 2,648 కి.మీ. సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని, మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. దేశ వ్యాప్తంగా ఈ సైకిల్ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.

# ఫారాల కొరత.. పలుచోట్ల ఆందోళనలు

సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో దరఖాస్తు ఫారాల కోసం ప్రజలు ఎగబడ్డారు. మొదటి రోజు కావడంతో దరఖాస్తు ఫారాలు ఎక్కువ రాకపోవడంతో తమకు దొరుకుతాయో లేదోనని ప్రజలు ఆందోళన చెందారు. ప్రజలంతా ఎగబడడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. చివరకు అధికారులు జిరాక్సులు తీయించి ప్రజలకు అందజేశారు. బిచ్కుందలో ఫారాల పంపిణీ సందర్భంగా తోపులాట చోటు చేసుకున్నది. కొందరికి ఫారాలు అందకపోవడంతో జీపీ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తహసీల్దార్ చొరవ తీసుకొని ఫారాలు అందజేయడంతో ఆందోళన విరమించారు.



అడ్లూర్ ఎల్లారెడ్డిలో దరఖాస్తు ఫారాల కోసం ఎగబడుతున్న జనాన్ని నియంత్రిస్తున్న పోలీసులు

## అర్జీల స్వీకరణలో పొరపాట్లు ఉండొద్దు



బోధన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్, డిసెంబర్ 28: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో పొరపాట్లు ఉండకుండా చర్యలు చేపట్టాలని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. బోధన్ పట్టణంలోని 26వ వార్డులో ఏర్పాటు చేసిన అర్జీల స్వీకరణ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అర్హులందరూ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో బి. రాజా గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి, విద్యుత్ శాఖ డీఈ ముక్తార్ అహ్మద్, మున్సిపల్ డీఈఈ లింగంపల్లి శివానందం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అచ్చంపేటలో ప్రజాపాలన తీరును అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

నిజాంసాగర్,డిసెంబర్ 28: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సూచించారు. నిజాంసాగర్, మహ్మద్‌నగర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం అచ్చంపేట గ్రామంలో కలెక్టర్ జితేశ్‌తో కలిసి కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో, ప్రత్యేకాధికారి సాయాగౌడ్, మండల ప్రత్యేకాధికారి విజయ్‌భాస్కర్, ఎంపీడీవో నాగేశ్వర్, తహసీల్దార్లు భిక్షపతి, క్రాంతికిరణ్, ఎంపీవో అబ్బాగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## గ్యారెంటీలను అమలుపరుస్తాం



ఖానాపూర్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 28: తమ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ హామీలను తప్పనిసరిగా అమలుపరుస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి అన్నారు. నగర శివారులోని ఖానాపూర్‌లో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్యారెంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, కార్పొరేటర్ కోర్వ లలితాగంగాధర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తు స్వీకరిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ క్రైం,డిసెంబర్ 28: ప్రజా పాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని శివాజీనగర్, 26వ డివిజన్‌లోని గౌడ సంఘంలో ప్రజాపాలనా కార్యక్రమాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ మంద మకరందొతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీపీ శ్యామ్, కార్పొరేటర్ బంటు వైష్ణవీరాము, అధికారులు పాల్గొన్నారు.



నగరంలో దరఖాస్తులను అందించేందుకు గుమిగూడిన జనం

# ఆగమాగం.. గందరగోళం!

- సామాన్య ప్రజల్లో సందిగ్ధత
- ఒక్కో చోట ఒక్కో విధంగా దరఖాస్తుల స్వీకరణ
- స్పష్టత ఇవ్వడంలో ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం
- బ్యాంక్ అకౌంట్ వివరాలు తీసుకోకపోవడంపై అనుమానాలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న అభయహస్తం గ్యారెంటీ పథకాలకు దరఖాస్తుల ప్రక్రియ అంతటా షురూ అయ్యింది. సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు చెప్పిన దానికి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రక్రియకు పొంతన లేకుండా కనిపించింది. ఒక్కోచోట ఒక్కో విధంగా అన్నట్లుగా పరిస్థితులు దాపురించాయి. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో దరఖాస్తుల కోసం ప్రజలంతా ఆసక్తి చూపారు. జనాభా ఆధారంగా కౌంటర్లను ఏర్పాటు చేసినప్పటికీ వారిలో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైంది.

| మొదటిరోజు స్వీకరించిన దరఖాస్తులు | |
|---|---|
| నిజామాబాద్ జిల్లా | కామారెడ్డి జిల్లా |
| 28,868 | 21,914 |

నిజామాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అభయహస్తం దరఖాస్తుదారుల్లో అయోమయం నెలకొన్నది. ఇప్పటికే పింఛన్లు అందుకుంటున్న వారంతా మరోసారి అభయహస్తం దరఖాస్తు ఫారాలతో కౌంటర్ల వద్దకు వచ్చారు. పాత లబ్ధిదారులు తిరిగి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ఫారంలోనే స్పష్టంగా పేర్కొన్నప్పటికీ వారికి అవగాహన కల్పించే వారు కరువయ్యారు. రేషన్‌కార్డుల విషయంలో జనమంతా అయోమయానికి గురయ్యారు. పాత రేషన్ కార్డుల్లో పేరున్న వారంతా కొత్తగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేయాలా? వద్దా? అని గందరగోళానికి గురయ్యారు. కొన్ని చోట్ల రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులను టీమ్ లీడర్లు స్వీకరించారు. రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రులే స్వయంగా చెప్పినప్పటికీ ప్రజల్లో అయోమయం నెలకొన్నది. కొత్తరేషన్ కార్డు కోసం దరఖాస్తు చేయడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయా? అందవా? అన్న మీమాంసలో ఉన్నారు.

### ఇష్టారాజ్యం..

నిజామాబాద్ జిల్లాలో ఉన్నతాధికారులు క్షేత్ర పర్యటనలకు బదులుగా ఆఫీసులకే పరిమితం కావడం ద్వారా పలు శాఖలకు సంబంధించిన స్పెషల్ ఆఫీసర్లు మండలాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ప్రజలకు సహాయకారిగా అక్కడక్కడ అంగన్‌వాడీ సిబ్బందిని వాడుకున్నారు. 28న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వచ్చే నెల 6వ తేదీ వరకు కొనసాగుతుంది. మధ్యలో 2 రోజులు సెలవులు ఉండగా మిగిలిన రోజుల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని అధికారులు చెబుతున్నారు. అభయహస్తంలోని వివిధ పథకాలకు దరఖాస్తు చేసే క్రమంలో రేషన్ కార్డు జత చేయాలని ప్రభుత్వం సూచించింది. కానీ రేషన్ కార్డు లేని వారి పరిస్థితిపై స్పష్టత కొరవడింది. దీంతో నూతనంగా వివాహాలు చేసుకుని వేరే కాపురం పెట్టిన కుటుంబాలు, ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయిన వారి పరిస్థితి గందరగోళంలో పడింది.

### బ్యాంక్ అకౌంట్ వివరాలు వద్దా?

ఉమ్మడి జిల్లాలోని గ్రామాలు, మున్సిపాలిటీల్లో వేర్వేరుగా ఏర్పాట్లు చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు స్వయంగా ఈ విషయాన్ని పర్యవేక్షించినప్పటికీ పలు లోటుపాట్లు కనిపించాయి. నిజామాబాద్ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో మొదటి రోజు పలుచోట్ల మిశ్రమ స్పందన వచ్చింది. అభయహస్తం పథకాలకు దరఖాస్తులో ఎక్కడా బ్యాంక్ అకౌంట్ వివరాలను అడగలేదు. దీంతో లబ్ధిదారులు, ఆశావహులంతా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బ్యాంక్ డీటైల్స్ లేకుండా ఈ దరఖాస్తులను ఏం చేస్తారంటూ పలుచోట్ల ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. ముందు జాగ్రత్తగా చాలా చోట్ల బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌ను జత చేయగా తిరస్కరించారు. మహాలక్ష్మి పథకంలో రూ. 2500 సాయం, రైతుభరోసా కింద ఎకరానికి రూ. 15వేలు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం, చేయూత పథకం ద్వారా పింఛన్లు వంటి వాటికి ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం ఏ విధంగా చేపడుతుందో అర్థం కాని దుస్థితి నెలకొన్నది. ఈ విషయంలో స్పష్టత లేకపోవడంతో ప్రభుత్వ యంత్రాంగం సైతం మిన్నకుండి పోవాల్సి వచ్చింది.



నగరంలోని నాందేవ్‌వాడలో దరఖాస్తుల కోసం బారులుతీరిన జనం

# నీటిని వృథా చేయొద్దు

- వరినాట్లు త్వరగా వేసుకోవాలి
- నీటి విడుదలపై ఎవరి మెహర్బానీ అవసరం లేదు
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, డిసెంబర్ 28: నిజాంసాగర్ ఆయకట్టు రైతులు నీటిని వృథా చేయొద్దని, వరినాట్లు త్వరగా పూర్తి చేసుకోవాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సూచించారు. నాట్లు త్వరగా పూర్తి చేస్తే మార్చి చివరికల్లా పంటలు కోత దశకు వస్తాయని, దీంతో వడగండ్ల వాన నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. బాన్సువాడలో గురువారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. విలేకరులతో మాట్లాడారు. నాలుగు, ఐదేండ్లుగా తమ సూచనలు పాటించి లబ్ధి పొందారని తెలిపారు. ఇటీవల కొంతమంది తాము చెప్తేనే నీటిని విడుదల చేస్తారని చెప్పుకుంటున్నారని, నిజాంసాగర్ నీరు రైతుల హక్కు అని, ఎవరో చెబితే జరిగేది కాదనే విషయాన్ని వారు గుర్తించాలని అన్నారు. 30ఏండ్ల నుంచి నీటి విడుదల యథావిధిగా కొనసాగుతున్న చర్యేనని, ఆ విషయంలో ఎవరి మెహర్బానీ, ఎవరి ఒత్తిడి, రాజకీయ ప్రమేయం అవసరం లేదన్నారు. రైతుల అవసరాలను గుర్తించి అధికారులే నీటిని విడుదల చేస్తారని, అవసరమైతే కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే అయిన తన సూచనలు తీసుకుంటారని తెలిపారు.రైతాంగానికి కష్టకాలంలో కూడా సాగునీరందించి పంటలను బతికించామని గుర్తుచేశారు. సాగర్ నీరు చివరి ఆయకట్టుకు చేరేలా రూ.150కోట్లతో కాలువలు బాగు చేయించానని, ఎక్కడ కూడా నీరు వృథా పోదని తెలిపారు.

### పార్లమెంటు ఎన్నికల వరకు కాలయాపన..

ప్రజాపాలన పేరిట ఆరు హామీలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, ఇదంతా పార్లమెంటు ఎన్నికల వరకు కాలయాపన చేసి కొత్త నాటకాన్ని సృష్టిస్తారని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా తు.చ తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి ఇంకా అమలు చేయలేదని, ఎకరానికి రూ.15వేలు పంట పెట్టుబడి సాయం వేయలేదని, 200 యూనిట్ల వరకు కరెంటు ఫ్రీ అని చెప్పారని, మీరిచ్చిన హామీలను మీకు గుర్తుచేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో తమ కుటుంబం రైతుబంధు తీసుకోలేదని, ఇప్పుడు అవసరం ఉన్నందున తాము కూడా దరఖాస్తు చేసుకుంటామని తెలిపారు. తమ హయాంలో కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్, రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు సంపదను పంచిపెట్టామని తెలిపారు. గత ప్రభుత్వంపై బట్టకాల్చి మీద వేసే ప్రయత్నం చేయడం సరైన పద్ధతి కాదని సూచించారు. ఆయన వెంట రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఏర్వాల కృష్ణారెడ్డి, ప్రమోద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# గత ప్రభుత్వ పథకాలు ఆపడం సరికాదు

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ, డిసెంబర్ 28 : గత ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను ఆపడం సరికాదని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. తాను చేసిన అభివృద్ధిని గుర్తించి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు మ రింత బాధ్యతగా సేవలందిస్తానన్నారు. బాల్కొం డ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని మతాల పండుగలను అధికారికంగా నిర్వహించే సంప్రదాయాన్ని ప్రారంభించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. వేడుకల్లో అధికారులు పాల్గొనే స్ఫూర్తి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కొనసాగిందని, ప్రస్తుతం ఆ స్ఫూర్తిని పక్కన పెట్టడం సరైంది కాదన్నారు. ఫొటోలు పెట్టకుండా ప్రొటోకాల్‌ను విస్మరించారని, ఫొటోలు పెట్టనంత మాత్రాన తనకేమీ ఇబ్బంది లేదన్నారు. ప్రజల మనస్సుల్లో తానున్నానన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్డీఎఫ్ నుంచి మసీదులు, ఆలయాలు, సంఘ భవనాలు తదితర అభివృద్ధి పనులకు చేయించిన మంజూరీలను ఆపాలని ప్రయత్నిస్తున్నట్లు వినిపిస్తున్నదని,అభివృద్ధి పనులను యథావిధిగా ముందుకు తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను కోరారు. ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీలు, నియోజకవర్గ క్రిస్టియన్ డెవలప్‌మెంట్ ఫోరం, క్రైస్తవ పాస్టర్ల అసోసియేషన్, అంతర్జాతీయ స్పీకర్ డాక్టర్ జాన్ వెస్లీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

రెక్కాడితే గానీ డొక్కాడని వాళ్లు ఎందరో.. కాలం ఏదైనా వారి పరుగు మాత్రం ఆగదు. ప్రస్తుతం కనిష్ఠ ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతుండడంతో చలి పంజా విసురుతున్నది. దీనికి తోడు భారీగా పొగ మంచు సైతం కమ్మేస్తున్నది. ఉదయం 9 గంటలు అయినా రోడ్లు కనిపించని పరిస్థితి ఏర్పడుతున్నది. గజగజ వణికించే చలిలోనూ తమ బతుకు బండి లాగేందుకు పరుగులు పెడుతున్నారిలా..







పొట్టకూటి కోసం పాట్లు..

## ఎన్నికల ఖర్చు వివరాలను అందజేయాలి

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 28 : అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ప్రచార ఖర్చుల వివరాలను సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ఖర్చుపై రికన్సీలేషన్ ప్రక్రియను ఈనెల 29న నిర్వహిస్తామని, అభ్యర్థులందరూ సమీకృత కలెక్టరేట్‌లో వివరాలను సమర్పించి, జమాఖర్చుల్లో వ్యత్యాసాలను సరిచూసుకోవాలని పేర్కొన్నారు.

## ముగిసిన ఢిల్లీ బృందం పర్యటన

రామారెడ్డి, డిసెంబర్ 28: రామారెడ్డిలో కొనసాగుతున్న ఢిల్లీ బృందం పర్యటన గురువారం ముగిసింది. జాతీయ నాణ్యతా ప్రమాణాల కమిటీ సభ్యులు డాక్టర్ పవెంత్, రోణక్‌శర్మ ఆధ్వర్యంలో రామారెడ్డి పీహెచ్‌సీలో వసతులు, అందిస్తున్న సేవలపై రెండు రోజులు అధ్యయనం చేశారు. వైద్య సబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రభుత్వ దవాఖానకు గర్భిణులు ఎక్కువ సంఖ్యలో వచ్చేలా చూడాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీపీవో పద్మజ, మండల వైద్యాధికారి డాక్టర్ సురేశ్, హెచ్‌ఈ భీమ్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.